క్లుప్తంగా

ఘనంగా మదుగులమ్మ తీర్థం


ప్రత్యేక అలంకరణలో మదుగులమ్మ అమ్మవారు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామదేవత మదుగులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

బాధితులకు వంట సామగ్రి అందజేత


బాధితులకు సామగ్రి అందిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

రంగంపేట: మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో చంద్రపుల్లారెడ్డి నగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధితులకు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు సహకారంతో ఆదివారం వంట సామగ్రి, బియ్యం, మంచం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబులు మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా నాయకులు దేశెట్టి సురేష్, శ్రీను, వీరన్న, పడాల శ్రీను, కన్నబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించని వాటర్ ప్లాంట్లను మూసివేయాలి

రాజానగరం: ప్రజల తాగునీటి అవసరాలకు వాటర్ టిన్నులపై ఆధారపడివుండటంతో ఎక్కడబడితే అక్కడ వాటర్ ప్లాంట్లు ఏర్పడుతున్నాయని, అయితే వాటి నిర్వాహకులలో చాలామంది సరైన నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా ప్రజలకు లేనిపోని రోగాలకు తెచ్చిపెడుతున్నారని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు ఆరోపించారు. హెల్త్ అండ్ సేఫ్టీ శాఖల అధికారులు కూడా వీటిని పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటించని వాటర్ ప్లాంట్లను తక్షణమే మూసివేయించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా అఖండ హరినామ సంకీర్తన


సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

ప్రకాశం నగర్: ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో గౌరపూర్ణమి (హోలీ) సందర్భంగా ఆదివారం అఖండ హరినామ సంకీర్తన నిర్వహించారు. నగర సంకీర్తనతో గోదావరి నదీ జలపూర్ణ కలశం స్థాపనతో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సోమవారం ఉదయం 9 గంటల వరకూ కొనసాగుతుంది. శ్రీకృష్ణ చైతన్య మిషన్ డిప్యూటీ సెక్రటరీ అండ్ టెంపుల్ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. కాగా.. శ్రీ చైతన్య మహాప్రభు 537వ ఆవిర్భావ మహోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం 7 గంటల నుంచి పంచామృత ఫలపుష్పాలతో స్వామివారికి విశేష అభిషేకాలు చేయనున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు జగన్ కృషి

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- పార్టీలో పలువురి చేరిక


బూరుగుపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానం పలుకుతున్న రాజా


కణుపూరులో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న విజయలక్ష్మి

మధురపూడి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కోరుకొండ మండలం బూరుగుపూడి ఎస్సీపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ పోరాటం చేశారన్నారు. విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ పేరిట అట్టడుగు వర్గాలకు జగన్ అండగా నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య రంగాలకు అత్యంత ప్రాధాన్యతిచ్చిన ప్రభుత్వం తమదేనన్నారు. ఈ ఎన్నికలు పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమని, ఈ యుద్ధంలో జగనన్నకు అండగా నిలవాలన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, చేయూత తదితర సంక్షేమ పథకాల ద్వారా జగనన్న ప్రభుత్వం పేదలకు ఆర్థిక భరోసా కల్పించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. జగనన్నను మళ్లీ సీఎం చేయాలన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వ్యవసాయ సలహామండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, బూరుగుపూడి మాజీ సర్పంచ్ కంటే సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టా కృష్ణ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మేకా నెహ్రూరాజు, పార్టీ నాయకులు ఏడిద ప్రసన్న కుమార్, కొల్లి సుందరరావు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే అందరి సంక్షేమం

జగన్ పాలనలోనే అందరి సంక్షేమ సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం రాజవరం, కణుపూరు గ్రామాల్లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను ఫ్యాన్ గుర్తుపై ఓటే వేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీలో చేరిక పలువురికి కండువాలు వేసి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గోగులమ్మ-భూలోకమ్మల జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: మండలంలోని మహేంద్రవాడ గ్రామ దేవతలు గోగులమ్మ-భూలోకమ్మ వార్ల జాతర, తీర్థం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గ్రామ దేవతలుగా మహేంద్రవాడ గ్రామస్తుల పూజలందుకుంటున్న అమ్మవార్లకు ఏటా ఉగాదికి ముందు వచ్చే పౌర్ణమి రోజున ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి
- శహపురంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం


శహపురంలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

పెదపూడి: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి రావాలని కుట్రలు పన్నుతున్న చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. శహపురం గ్రామంలో ఆదివారం ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు ప్రతి గడపలో మహిళలు హారతులిచ్చి, శాలువలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల వల్ల ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అందించారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన మంచిని చూసి ప్రజలు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి తన భర్త ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని గెలిపించాలని కోరారు. తప్పుడు వాగ్దానాలు ఇచ్చిన చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, పెదపూడి, అనపర్తి మండలాల జెడ్పీటీసీ సభ్యులు పేపకాయల వెంకటలక్ష్మి, సత్తి గీతా వరలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు చందాల పార్వతీ, కాండ్రేగుల సొసైటీ చైర్మన్ గాజంగి వెంకటరమణ, పి.చంద్రకళ, మేడపాటి విజయ, సీహెచ్‌వీ రమణ, గాజంగి వరదాంజనేయులు, బుద్దాల శ్రీను, గాజంగి వీరబాబు, రాయుడు మురళీ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి రహిత సమాజమే అందరి లక్ష్యం


పెదపూడి సీహెచ్‌సీ వద్ద టీబీపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

పెదపూడి: క్షయ వ్యాధి రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని పెదపూడి సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ రమణమూర్తి అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవంపై అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన చికిత్స లభిస్తుందన్నారు. క్షయ వ్యాధి సోకిన వారికి ఒకటి లేదా రెండు వారాల పైబడి దగ్గు, ఛాతీలో నొప్పి, ఆకలి లేకపోవుట, బరువు తగ్గడం, సాయంత్రం సమయంలో జ్వరం, కఫంలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ప్రాథమిక దశలోనే క్షయ వ్యాధిని గుర్తించి సకాలంలో చికిత్స అందించడంతో బాధితులు వ్యాధిని జయిస్తారన్నారు. వారికి టీబీ నిర్ధారణ అయితే ఉచితంగా ఆరు నెలలు పాటు మందులు, పౌష్టికాహారం నిమిత్తం ప్రతి నెలా రూ.500 బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుభాష్, టీబీ సూపర్‌వైజర్ సీహెచ్‌వీ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవా కార్యక్రమాలు


సర్టిఫికెట్లు అందుకున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీలో సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వలంటీర్లు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.సుధామయి ఆధ్వర్యంలో ఆఖరి రోజు గ్రామంలో ర్యాలీగా వెళ్లి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. వీధుల్లోని చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. అనంతరం రైతు భరోసా కేంద్రం, పాఠశాల ఆవరణలో జామ, గానుగ, బాదం మొక్కలను నాటారు. వీధులకు ఇరువైపులా పలు రకాలైన మొక్కలను నాటారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు. బెస్ట్ వలంటీర్లగా ఎంపికైన రాజు, అబ్దుల్ ఆలీ, జెఫీబాబు, అలీమ్, దినేష్, జయప్రకాష్, బన్నీ, సింధుప్రియ, వరలక్ష్మి, సంతోషి, అనూష, మల్లేశ్వరి, వసంతదుర్గలకు అవార్డులను ఎం.సుధామయి, చరిత్ర అధ్యాపకుడు ఫణీంద్ర అందజేశారు. శిబిరంలో పాల్గొన్న వలంటీర్లందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అధ్యాపకుడు సుబ్బారావు, గ్రామస్తులు కనకం సత్యనారాయణ, పోశయ్య, వెంకటేశ్వర్లు, పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


అనపర్తి శిలువలమ్మ చర్చిలో జరిగిన మట్టల ఆదివారం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


పెదపూడిలో ఈత మట్టలు చేతబట్టి ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు


దొడ్డిగుంటలో మట్టల వేడుకలో పాల్గొన్న లూథరిన్ చర్చి సంఘ సభ్యులు

అనపర్తి: క్రీస్తు బోధనలు మానవాళికి ఆదర్శం, అనుసరణీయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే మట్టల ఆదివారం పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు శిలువ వేయటానికి ముందు జెరూషలేములో ఆయనను ప్రజలు దైవ కుమారుడని కీర్తిస్తూ ఈత మట్టలతో ఘన స్వాగతం పలికిన వైనాన్ని గుర్తు చేసుకుంటూ ఏటా క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు వివిధ రకాల పూలతో అలంకరించిన ఈత మట్టలను చేతపట్టి ప్రభువు కీర్తనలు ఆలపిస్తూ చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక శిలువలమ్మ చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక రక్షకుడైన క్రీస్తు ప్రతిఒక్కరి పాప విమోచన గావించేందుకు ఈ లోకంలో అవతరించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

పెదపూడి: మండలంలోని పలు చర్చిల్లో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం క్రైస్తవులు, చిన్నారులు ఈత చెట్టు మట్టలను చేత పట్టి వాటిని రకరకాల పూలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పెదపూడిలో బేతేలు చర్చిలో పాస్టర్ చుక్కా శామ్యూల్‌రాజు, దేవ కుమారి దంపతులు, కరకుదురులో జోసెఫ్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్లు వి.జోసెఫ్ విక్టర్, పాల్‌జీ తిలక్‌లు మట్టల ఆదివారం ప్రత్యేకతను వివరించారు. పాస్టర్ చుక్కా జాన్‌రత్నం, క్వయిర్ టీమ్ ప్రతినిధి చుక్కా మేరీషర్మిల ఆధ్వర్యంలో ఊరేగింపు జరిగింది. క్రైస్తవ చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దొడ్డిగుంటలో మట్టల వేడుక

రంగంపేట: మండల పరిధిలోని దొడ్డిగుంటలో లూథరిన్ చర్చిలో పాస్టర్ జె.షెడ్రుక్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లూథరన్ సంఘ సభ్యులు, విద్యార్థులు ఈత మట్టలను అందంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చి వద్ద జరిపిన వేడుకలో పాస్టర్ షెడ్రుక్ మట్టల పండగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు ప్రభుదాసు, రత్నంరాజు, వసంతరావు, జాన్‌బాబు, చిన్నారావు, ధర్మరాజు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు

ప్రకాశం నగర్: మెయిన్ రోడ్డులోని శ్రీ షిర్డీసాయి మందిరంలో ఐదురోజుల పాటు జరిగే ద్వాదశ (12వ) వార్షిక కుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అద్దంకి వేంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు నిర్వహణలో మైలవరపు నారాయణ బ్రహ్మత్వంలో దెందులూరి శ్యామ్ కుమార్ అర్చకత్వంలో జరుగుతున్నాయి. ఉదయం 6 గంటలకు నుంచి విఘ్నేశ్వర పూజతో ప్రత్యేక పూజలకు శ్రీకారం చుట్టారు. శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదన గోపాలస్వామి సైతం దీక్ష తీసుకుని కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీహరే శ్రీనివాస భజన మండలి వాకచర్ల భద్రమ్మ బృందం మానుమాన్ చాలీసా పారాయణ చేసింది. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకూ పూజలు జరిపారు. రాత్రి 8 గంటలకు సాయి సేవకుడు పొక్కులూరి రామమూర్తి శ్రీ షిర్డీసాయి లీలలపై ప్రవచనం నిర్వహించారు. అనంతరం మల్లాది నరసింహారావు శాస్త్రీయ గాత్ర కచేరి అలరించింది.

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు


విజేత జట్టుతో షర్మిలారెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: క్రీడల ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. కాతేరులోని భరత్ నగర్ మైదానంలో భరత్ నగర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కాట్రు అనిల్ (ఫ్రాన్సిస్) మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన షర్మిలారెడ్డి టోర్నమెంట్ విజేత భరత్ నగర్ యూత్, రన్నర్స్ నందరాడ యూత్ టీం సభ్యులకు ట్రోఫీలు, నగదు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు యెజ్జు వాసు, నిర్వాహకులు గోపి దోసేపాటి, చీకట్ల కిరణ్, సునీల్, రంజిత్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ యువజన అభ్యున్నతికి కృషి

రాజమహేంద్రవరం సిటీ: బ్రాహ్మణ యువజన అభ్యున్నతి కోసం బ్రాహ్మణ యువజన వృత్తి నిపుణుల సంస్థ (బైపా) పనిచేస్తుందని ఐటీ ప్రముఖుడు డాక్టర్ ఫణీంద్ర గొల్లపల్లి అన్నారు. నగరంలోని చందా సత్రంలో ఆదివారం తూర్పుగోదావరి బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యాచరణ సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఫణీంద్ర మాట్లాడుతూ యువ బ్రాహ్మణ వృత్తిదారుల కోసం బైపా అనే సంస్థను ప్రారంభించామన్నారు. అన్ని రంగాల్లో బ్రాహ్మణ యువత ముందుకు దూసుకువెళ్లాలన్నారు. ఈ సందర్భంగా సంస్థ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

అడ్మిన్‌లూ .. అప్రమత్తం..



- అమలులోకి ఎన్నికల కోడ్
- సోషల్ మీడియాపై పోలీసుల నిఘా
- తప్పుడు ట్రోలింగ్‌లు చేస్తే కఠిన చర్యలు

కంబాలచెరువు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దాని చాలా కట్టుదిట్టంగా అధికార యంత్రాంగం అమలు చేస్తోంది. రాజకీయ పార్టీల ప్రచారాలు, సమావేశాలు, సభలు తదితర వాటికి కూడా అనుమతులు తప్పనిసరి అని తేల్చిచెప్పింది. ఇదే సమయంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్ వంటి సోషల్ మీడియా మాధ్యమాలపై పోలీసు శాఖ దృష్టి సారించింది. వాటిలో ఏవైనా అసభ్యకర ట్రోలింగ్‌లు, తప్పుడు ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు జరిగితే వెంటనే చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూప్‌ల అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏ గ్రూపులో ఇలాంటివి జరిగినా అడ్మిన్లతో బాధ్యత అని స్పష్టం చేసింది. వారు ఏమాత్రం జాగ్రత్త వహించకపోతే కటకటాల పాలవ్వక తప్పదు. తప్పుడు వార్తల ప్రచారాలు, ట్రోలింగ్‌లు చేస్తే ఐపీసీ 153 (ఏ) సెక్షన్ కింద ఐదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ కార్యకర్తలు, వారి అనుచరులు, ఎవరైనా సరే సోషల్ మీడియా వేదికగా చేసుకుని అవతలి వారిని దుర్భాషలాడుతూ, మహిళలను కించపర్చేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు పోలీసు శాఖ ఉత్తర్వులు వెలువరించింది.

సోషల్ మీడియా అడ్మిన్ల బాధ్యతలు

- వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి గ్రూప్‌లో ప్రతి పోస్టుకీ అడ్మిన్ బాధ్యత తీసుకోవాలి
- గ్రూప్‌లో యాడ్ చేసే ప్రతి సభ్యుడూ తప్పకుండా అతడికి తెలిసి ఉండాలి.
- అభ్యంతరకర, తప్పుడు వార్త, వదంతులపై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలి.
- ఎవరైనా సభ్యులు అభ్యంతకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూప్ నుంచి తొలగించాలి.
- వివాదాస్పద పోస్టింగ్‌పై అడ్మిన్ ఏ చర్యలూ తీసుకోకుంటే అతడిపై పోలీసులు చర్యలు తీసుకుంటారు.
- అడ్మినే వివాదాస్పద పోస్టు చేస్తే ఐటీ చట్టం, ఐపీసీ సెక్షన్ 153(ఎ) కింద శిక్ష విధిస్తారు. అలాంటి వారికి మూడు నుంచి ఐదేళ్ల వరకూ జైలుశిక్ష పడే అవకాశం ఉంటుంది

షేర్ చేయకూడని అంశాలు

- విద్వేషాలు రెచ్చగొట్టే వార్తలు
- తప్పుడు సమాచారం
- తెలియని సమాచారం
- వర్గపోరుకు దారి తీసేవి
- మార్ఫింగ్ చేసిన ఫొటోలు
- తప్పుదారి పట్టించే సమాచారం

కేసులు నమోదు చేసే సెక్షన్లు ఇవే..

ఆన్ లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ఈ క్రింది సెక్షన్లలో కేసులు నమోదు చేశారు.

67 ఐటీ యాక్ట్

ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు పాల్పడితే ఈ సెక్షన్ కింద గరిష్ఠంగా ఐదేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారు.

ఐపీసీ సెక్షన్ 354

ఉద్దేశపూర్వకంగా ఒక మహిళను లక్ష్యంగా చేసుకొని వేధించడం, సోషల్ మీడియా వేదికల ద్వారా అదే పనిగా సంప్రదించడం, వెంటపడడం, దూషించడం, అవమానించడం, వేధించడం వంటి వాటిని తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తారు. ఈ సెక్షన్ కింద గరిష్ఠంగా ఐదేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారు.

రెచ్చగొట్టే వారిని గుర్తిస్తాం



సామాన్యులను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో చేసే వేధింపులు, ట్రోలింగ్‌లను తీవ్రంగా పరిగణిస్తాం. అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్న వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటాం. ట్రోలింగ్‌లు చేస్తూ సోషల్ మీడియా యూజర్లకు తప్పుడు సమాచారం చేరవేస్తే వారిని ఐపీ అడ్రస్ ద్వారా గుర్తించి కేసు నమోదు చేస్తాం. సైబర్ బుల్ షీట్లను తెరిచి దర్యాప్తు ముమ్మరం చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

– పి.జగదీష్, జిల్లా ఎస్పీ

28న పార్శిళ్ల బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని పార్శిల్ కార్యాలయం వద్ద ఈ నెల 28వ తేదీ ఉదయం 11.30 గంటలకు అన్ క్లైమ్‌డ్ పార్శిళ్లకు (ఎవ్వరూ తీసుకెళ్లకుండా వదిలేసిన పార్శిళ్లు) బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ మాధవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలవారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునన్నారు.